క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం

అద్దంకి: రక్తదానం ప్రాణదానం అని రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకర్‌రావు అన్నారు. ఆయన సోమవారం రక్తహీనత సమస్యతో బాధపడుతున్న కొత్త మాసు లక్ష్మి కోటేశ్వరమ్మకు అవసరమైన బీ పాజిటివ్ రక్తాన్ని పట్టణానికి చెందిన మారం సత్య సురేంద్రను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఇదే విధంగా అపోహలు వీడి రక్త దానం చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు.

రేపు మహిళా డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాలో శ్రీసిటీలోని హీరో మోటార్స్, డైకిన్, నియో లింక్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని జేకేసీ కో–ఆర్డినేటర్ ఎస్. సాయిప్రసన్న తెలిపారు. అసెంబ్లర్, ట్రైనీ పోస్టులకు జరిగే ఈ ఇంటర్వ్యూల్లో ఇంటర్ పాస్, ఏదైనా డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, 18 నుంచి 22 సంవత్సరాలు చదువుతున్న అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13500 ప్రారంభ వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటో, పది, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని జేకేసీ మెంటార్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు.

చిన్నారులకు ఆధ్యాత్మిక భావన అవసరం



చిన్నారులకు అల్పాహారం అందజేస్తున్న దాతలు

చినగంజాం: తల్లిదండ్రులు బిడ్డలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావనలను పెంపొందించాలని అంబేడ్కర్ నగర్‌లోని యెహోవా యీరే ప్రార్థన మందిరం దైవ సేవకులు తుల్లిమల్లి అబ్రహం లింకన్‌బాబు అన్నారు. అంబేడ్కర్ నగర్‌లోని దైవసేవకులు తుల్లిమల్లి గాబ్రియేలు, సుశీలమ్మ ఇంటి వద్ద క్రిస్మస్ క్యారెల్స్ చిన్నారులకు అల్పాహారం, స్నాక్స్, టీ అందజేశారు. కార్యక్రమంలో క్యారెల్స్ నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు, మనిషా, వజ్రమ్మ, లింకన్, కెజియా, కట్ట దిలీప్, శీలం యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దంపతులు

అద్దంకి: పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం విద్యార్థులకు బెంగళూరుకు చెందిన దంపతులు అప్పికట్ల శ్రీనివాస్, అనురాధ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎంఈవో బీ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు చేయూతనివ్వడం ఎంతో మంచి కార్యక్రమమని చెప్పారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం వేదవతి, కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

ధరలు పెంచి.. భారం మోపి !



వంట నూనెలు

- ఆకాశాన్నంటిన వంట నూనెల ధరలు
- సామాన్యులకు వంట నూనెల షాక్
- లీటరు పై రూ. 50 వరకూ ధరల పెరుగుదల
- ధరలు మరింత పెరిగేలా కృత్రిమ కొరత సృష్టి

వేటపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో నిత్యావసర ధరలు, కూరగాయలు భగ్గుమంటున్నాయి. ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల య్యాక మరో మాటతో ప్రజలను మోసం చేస్తున్నాయి ప్రభుత్వాలు. ఫలితంగా దిగువ, మధ్య తరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు అన్న చందంగా తయారైందని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కేంద్రంలోని కూటమి సర్కార్ తీరుతో వంట నూనె ధరలు అమాంతం ఆకాశాన్నంటుతున్నాయి. దిగుమతి సుంకాలను 20 శాతానికి పెంచేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వంటనూనె సామన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంది. నిత్యావసర సరుకులు ధరలు ఇప్పటికే గణనీయంగా పెరగడంతో వంటగదిలోకి వెళ్లాంటే సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఉల్లిపాయలు ధర కిలో రూ.73 కు చేరుకోగా, వెల్లుల్లి కిలో రూ. 400 పైమాటే. నోటికి రుచిగా ఏమైనా చేసుకుని తిందామనుకునే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఎన్నికల హామీని తుంగలో తొక్కి..

తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాలు ధరలు నియంత్రిస్తామంటూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పార్టీలు తుంగలో తొక్కేశాయి. అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ఉల్లి, వెల్లుల్లి ధరలు ఏమాత్రం తగ్గలేదు ఇంకా పైపైకి పోతున్నాయి. కనీసం ధరలు నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వంటనూనె దిగుమతిపై కేంద్రం 12.5 నుంచి 32.5 శాతానికి పెంచడంతో లీటరు రూ. దాదాపు 50 దరకూ ధరలు పెరిగాయి. ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందటూ కొందరు వ్యాపారుల తమ వద్ద ఉన్న నిల్వలను దాచేసి కృత్రిమ కొరతను సృష్టించారు.

మార్కెట్‌లో ప్రస్తుతం వంట నూనెల ధరలు ఇలా..

వంట నూనె	పాతధర	కొత్తధర
పామాయిల్	రూ.95	130
సన్ ఫ్లవర్	రూ.113	150
సోయాబీన్	రూ.108	145
వేరుశనగ	రూ. 220	250

ఊసే ఎత్తని సబ్సిడీ..

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవికావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. శుద్ధి చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది. దీంతో లీటరు ప్యాకెట్ పై రూ.35 నుంచి 50 వరకూ ధరలు పెరిగాయి. గతంలో వంట నూనె, కంది పప్పు ధరలు పెరిగినప్పుడు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వాలు సరఫరా చేసేది. ఈ నేపథ్యంలో వంట నూనె ధరలు పెరిగిన ప్రస్తుత తరుణంలో చౌకదుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కృత్రిమ కొతర సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ధరలు స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

ధరలు నియంత్రించాలి..



ఓ వైపు వ్యవసాయ ఖర్చులు, కుటుంబ సభ్యుల వైద్యం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పుడు నిత్యావసర సరుకులు, ఆయిల్ ధరలు పెంచారు. వాటిని కొనుగోలు చేయాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– వసుంధర, వేటపాలెం

సామాన్యులు మోయలేని భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగిపోవడంతో చాలా వరకూ వంటలు తగ్గించాం. నూనెల ధరలు కూడా పెంచేశారు. ఇంటికి బంధువులు వస్తే భయపడాల్సిన వస్తోంది. ధరలు పెంచి పేదలపై మోయలేని భారాన్ని వేసింది. వంట నూనెతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు నియంత్రించాలి.

– గుమ్మడి సుశీల, పందిళ్లపల్లి

గ్రామసభలు అస్తవ్యస్తం, అవినీతిమయం



మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

మార్టూరు: గతంలో రీసర్వే నిర్వహించిన గ్రామాలలో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలన్నీ లోపభూయిష్టం.. అవినీతిమయంగా ఉన్నాయని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఆయన మార్టూరులో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు బ్యాంకు రుణాలు మంజూరు కాక, భూములు రిజిస్ట్రేషన్లు జరగక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అధికారులు మాత్రం గతంలో రిసర్వే జరిగిన గ్రామాల్లోనే నామమాత్రంగా గ్రామసభలు నిర్వహించి మమ అనిపించారని ఆయన అన్నారు. గ్రామ సభల్లో ఇచ్చిన అర్జీల పరిష్కార కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాలకు వస్తే వారి అవసరాలను బట్టి అధికారులు రూ.100 నుంచి రూ.10000 వరకు లంచాలు డిమాండ్ చేయటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని మార్టూరు తసిల్దార్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం కనిపించ లేదని ఆయన అన్నారు. పోయేది రైతుల సొమ్మే కదా? తినేది తమ డిపార్ట్‌మెంట్ వారే కదా? అన్నట్లుగా తహసీల్దార్ వ్యవహార శైలి ఉందని ఆయన విమర్శించారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం గతంలో ఒకసారి నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ లను కలిసి సంప్రదించామని ఫలితం శూన్యమని ఆయన విచారం వ్యక్తం చేశారు.

ఆశ్రమానికి నిత్యావసరాల వితరణ



సరుకులు అందజేస్తున్న దాత ఆంజనేయులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యలో శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమానికి సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. విశ్రాంత టెలికామ్ ఏఈ పసుపులేటి ఆంజనేయులు మనవరాలు యశ్విత పుట్టిన రోజు సందర్భంగా వద్ధాశ్రమానికి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా మినీ క్రిస్మస్ వేడుకలు



వాక్య సందేశం అందిస్తున్న ఏఈఎల్‌సీ సెక్రటరీ కిషోర్‌బాబు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి సెయింట్ మార్క్స్ యూత్‌లీగ్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, రెవరెండ్ నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఈఎల్‌సీ తూర్పు గుంటూరు సినడ్ ప్రెసిడెంట్ బిషప్ కూరాకుల రత్నమోహన్, ఏఈఎల్‌సి సెక్రటరి చిన్నం కిషోర్‌బాబులు పాల్గొని దేవుని వాక్య సందేశం అందించారు. క్రిస్మస్ పండుగ పర్వదినాలలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో గడపాలని వారు ఆకాంక్షించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభువైన యేసుక్రీస్తు మన పాపాలను క్షమించేందుకు మానవ రూపంలో జన్మించారని ఆయన మన కోసం శిలువ మరణం పొందారని వారు గుర్తు చేశారు. చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగకు ముందుగా ప్రతిఏటా జరిపే విధంగానే ఈ ఏడాది కూడా మినీ క్రిస్మస్ వేడుకలు జరుపుతున్నట్లు చెప్పారు. ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, యూత్ ప్రెసిడెంట్ దేటా సతీష్, సండేస్కూలు సూపరింటెండెంట్ దేటా దివాకర్, బేతాళ సాల్మన్‌రాజు, వసంతరరావు, ప్రసాద్, యాతం క్రాంతి, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, మూల నక్షత్రం, విదియ తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు



కోనేరులో దీపాలను వదులుతున్న భక్తులు

చినగంజాం: నెల రోజుల పాటు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి చివరి రోజు పోలి స్వర్గంను పూర్తి చేసి కార్తీక మాసాన్ని ముగించారు. స్త్రీలు నెల రోజులపాటు ఆలయాలను సందర్శించి కార్తీక దీపాలను వెలిగించి శివపార్వతులను కొలుస్తూ ఇతర ఆలయాలను కూడా సందర్శించి పూజలు చేశారు. మాసం మొత్తంలో ఉపవాసాలు, సముద్ర స్నానాలు ఆచరిస్తూ తమ భక్తి ప్రపత్తులను ప్రదర్శించారు. చివరి రోజు సోమవారం పోలిని స్వర్గానికి పంపించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అరటి బొదెలలో దీపాలను వెలిగించి నీటిలో వదలి పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు వేకువ జామున నిద్ర లేచి తలంటు స్నానమాచరించి నది, ఏరు, కోనేరు వంటి నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లి దీపాలను నీటిలో వదలి పోలిని స్వర్గానికి పంపించారు. నీటి ప్రవాహాల చెంతకు వెళ్లలేని వారు ఇంటిలోని తొట్టిలో నీటిని ఉంచి దీపాలను వెలిగించి వదలి పెట్టారు. చినగంజాంలో మహిళా భక్తులు స్థానిక బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులోను, భావన్నారాయణ స్వామి ఆలయం, చిదంబరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, రామకోటేశ్వరాలయం ప్రాంగణంలోను కృత్రిమంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెలలో పోలి దీపాలను వదలి పెట్టారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



పూనూరులో ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకస్వామి

యద్దనపూడి: పవిత్ర కార్తీకమాసం చివరి రోజైన పోలి పాడ్యమి సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే బావులు, చెరువులు, కాలువల వద్ద స్నానమాచరించి నీటిలో కార్తీక దీపాలను అరటిదొన్నెల్లో ఉంచి నీటిలో వదిలారు. అనంతరం ఆలయాలకు చేరుకొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



చెన్నుపల్లిలో దీపాలు వదులుగున్న భక్తులు

వాడవాలా పోలి పాడ్యమి వేడుకలు

బల్లికురవ: కార్తీకమాసం ముగింపులో భాగంగా సోమవారం పోలిపాడ్యమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. నెలరోజుల పాటు కార్తీకమాస పూజలు, ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులంతా తెల్లావారు జామున నదులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లి అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నీటిలో వదిలి పెట్టారు. అనంతరం ఆలయాలకు వచ్చి శివుడు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

తహసీల్దారును నియమించండి సారూ..!

- రెండు నెలలుగా డీటీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



కారంచేడు రెవెన్యూ కార్యాలయం

కారంచేడు: తహసీల్దారు పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉండటంతో రైతులు, ప్రజలు, సర్టిఫికెట్లు అవసరమైన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ మంత్రి సొంత జిల్లాగా ఉన్న బాపట్ల జిల్లాలోని కారంచేడుకు రెండు నెలలుగా తహసీల్దారు రాకపోవడం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా ధాన్యగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలో ఎక్కువగా రైతుల సమస్యలుంటాయి. వీటి పరిష్కారానికి తప్పకుండా తహసీల్దారు ఉండాలి. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు అనేకమైన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండలస్థాయి మేజిస్ట్రేట్ అవసరం అని ప్రజలు అంటున్నారు. అక్టోబర్ నెలలో జరిగిన సాధారణ బదిలీల్లో అప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దారు కే నరసింహారావు రేపల్లెకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో డిప్యూటీ తహసీల్దారు ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. రెండు పోస్టులకు న్యాయం చేయడం సామాన్యమైన విషయం కాదని, ఇన్‌చార్జ్ పాలనకు స్వస్తి చెప్పి రెగ్యులర్ తహసీల్దారును వెంటనే నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌ఐ, వీఆర్వోల పోస్టుల ఖాళీ..

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే, డీటీ సైతం డిప్యూటేషన్‌పై చీరాలకు వెళ్లారని, ఇక సీనియర్ అసిస్టెంట్ పోస్టుతో పాటు, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కీలకంగా ఉండే రెవెన్యూ ఆఫీసర్ (ఆర్‌ఐ) పోస్టు కూడా ఖాళీగానే ఉందని చెప్తున్నారు. మండలంలోని జరుబుల వారిపాలెంలో ఒక వీఆర్‌ఓ, మండల కేంద్రమైన కారంచేడులో ఉండాల్సిన మూడు వీఆర్‌ఓ పోస్టులకుగాను ఒకరు మెటర్నటీ లీవ్‌లో ఉండగా, మరో రెండు పోస్టుల్లోను ఎవరూ రాలేదు. ఎప్పుడు రైతుల సమస్యలు ఉత్పన్నమవుతుండే మేజర్ గ్రామాల్లో సైతం వీఆర్‌ఓ పోస్టులు కాళీగా ఉండటం, వీటిల్లో ఇన్‌చార్జ్‌లను నియమించడంతో వారు కూడా తమ సొంత గ్రామాలతో పాటు, ఇన్‌చార్జ్ గ్రామాల్లో బాధ్యతలు నిర్వహించడం కత్తిమీద సాములా మారిందని ప్రజలు చెప్తున్నారు. ఇక కార్యాలయంలో అటెండర్ పోస్టుతో పాటు, నైట్ వాచ్‌మెన్ పోస్టు కూడా ఖాళీగానే ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇన్ని సమస్యలతో ఉన్న కారంచేడు రెవెన్యూ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఉచిత డేటా ఎంట్రీ కోర్సుకు దరఖాస్తులు

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును ఉచితంగా నేర్పించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాహిల్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్న ఈ కోర్సులో 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్రువీకరణపత్రాలు అందజేస్తాయని చెప్పారు. పూర్తి వివరాలకు 95439 70871, 94406 35677 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.

చీరాల అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్య సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ సోమవారం తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీయువకులకు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎం.హారిక, 79814 43777 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఎన్నిసార్లు తిరగాలి.. ఆన్‌లైన్ చేయరా ?



తహశీల్దార్ సింగారావుతో మాట్లాడుతున్న రైతు కృష్ణమూర్తి

జే.పంగులూరు: ఎన్ని సార్లు మీ చుట్టు తిరగాలి.. మూడుసార్లు రీసర్వే చేశారు అయినాగాని నాపొలాన్ని ఆన్‌లైన్ చేయరా అంటూ ఓరైతు తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈసందర్భంగా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన వీరవల్లి కృష్ణమూర్తికి కొండమంజులూరు రెవెన్యూ పరిధిలో 40–1 సర్వే నంబర్‌లో 0.95 సెంట్లు పొలం వంశపారపర్యంగా సక్రమించింది. గతంలో తన తండ్రి అయిన సుబ్బయ్య పేరున పొలం ఆన్‌లైన్‌లో ఉండేదని, ఆయన చనిపోయిన తరువాత ఆ పొలం నాకు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది కాని రెవెన్యూ అధికారులు వారి ఇష్టానుసారంగా వ్యవహరించారు. పొలం నా స్వనుభవంలో ఉన్నా ఆన్‌లైన్‌లో లేదని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 6 సంవత్సరాల నుంచి నా పొలం ఆన్‌లైన్ చేయండని తిరుగుతూనే ఉన్నాను. రెండు మూడు సార్లు రీ సర్వే కూడా చేయించాను అయిన ఫలితం లేకుండా ఉంది. ఇప్పుడైనా నాకు న్యాయం జరుగుతుందో లేదో చూడాలని రైతు అనుమానం వ్యక్తం చేశాడు.

ఈ–క్రాప్ నమోదుతో ఉపయోగాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు (చినగంజాం): రైతులు తాము సాగు చేస్తున్న పంటను ఈ–పంట నమోదు చేసుకోవాలని పర్చూరు డివిజన్ ఏడీఏ ఎన్ మోహనరావు అన్నారు. సోమవారం పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఏడీఏ ఎన్ మోహనరావు అధ్యక్షతన పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ పంట బుకింగ్ మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటని ఈ పంటలో నమోదు చేయించు కోవాలన్నారు. ఈ పంటలో నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం వారు అందించే పంట నష్టపరిహారం, పంట కొనుగోలు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాలు వస్తాయని తెలిపారు. ఈ పంట యాప్‌లో రైతు సేవా కేంద్రం సిబ్బంది దగ్గర రైతులు నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతు సిబ్బందికి ఈ–పంట నమోదు గురించి వివరించారు. కార్యక్రమంలో పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి మండలాల వ్యవసాయధికారులు రామ్మోహనరెడ్డి, వేణుగోపాల్, సుధీర్ బాబు, ఎస్ మేరిమ్మ, టెక్నికల్ ఏఓ మహేష్ బాబు, లతో పాటు వీఏఏలు,వీహెచ్‌ఏలు ఎంపీఈఓలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ గ్రామస్తులకు సూచించారు. సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ.. గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను బుట్టలలో వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.